# గిరిజన దేవర



ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తితో ఎదురుచూస్తున్న సినిమా 'దేవర1'. కొరటాల శివ రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ ఫ్రాంచైజీని సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణలతో కలిసి నందమూరి కల్యాణ్ రామ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం తొలి పార్ట్ షూటింగ్ దాదాపుగా ఆఖరి దశకు చేరుకుంది. ఇదిలావుంటే.. ఈ సినిమాపై అద్భుతమైన అప్‌డేట్ రివీలైంది. 'దేవర' కాన్సెప్ట్‌పై ఇప్పటికే రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. వాటన్నింటికీ తెరదింపుతూ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న అనిరుథ్ 'దేవర' కథా నేపథ్యాన్ని రివీల్ చేసేశాడు. ప్రస్తుతం ఆయన 'దేవర' రీ-రికార్డింగ్ పనిలో ఉన్నారు. అనుకోకుండా తనిచ్చిన ఓ ప్రైవేటు ఇంటర్వ్యూలో అనిరుధ్ మాట్లాడుతూ ' 'దేవర' అద్భుతమైన సినిమా. సరికొత్త స్క్రీన్‌ప్లేతో దర్శకుడు కొరటాల శివ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇది ఒక సముద్ర ప్రాంతానికి చెందిన గిరిజనుల నేపథ్యంలో సాగే కథ. సినేరియా కొత్తగా ఉంటుంది' అంటూ తెలిపారు అనిరుధ్.



# సర్దార్-2కు కొబ్బరికాయ కొట్టారు

తమిళ హీరో కార్తీని నటుడిగా మరోస్థాయిలో నిలబెట్టిన సినిమా 'సర్దార్'. ఆ సినిమాకు పార్ట్ 2 కూడా ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రకటించారు. ఇటీవలే 'సర్దార్ 2'కు సంబంధించిన పూజాకార్యక్రమాలు చెన్నైలో ఘనంగా జరిగాయి. ఈ నెల 15న చెన్నైలో నిర్మించిన భారీ సెట్స్‌లో షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ప్రీక్వెల్‌కు దర్శకుడైన పి.ఎస్.మిత్రన్ 'సర్దార్ 2'కి కూడా దర్శకత్వం వహించనున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి అత్యున్నత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారని నిర్మాతలు తెలిపారు. ఎస్.లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: యువన్‌శంకర్‌రాజా, నిర్మాణం: ప్రిన్స్ పిక్చర్స్.

# మారిపోయే నా లోకమే

**ప్రియదర్శి, నభా నటేష్** జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. అశ్విన్ కె రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కె.నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని మూడో గీతం 'సునో చెలియా' శుక్రవారం విడుదలైంది. వివేక్‌సాగర్ స్వరపరచిన ఈ గీతాన్ని కాసర్ల శ్యామ్ రాయగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 'మనసంటూ ఒకటుందని లోపల తోచిందే తొలిసారే.. కనులొచ్చి తిరిగిందే నా కల నీ వల్లే ఓ ప్రేమ.. మారిపోయే నా లోకమే..నిన్న లేదే ఇంతందమే..' అంటూ ప్రేమికుల భావాలకు అద్దం పడుతూ చక్కటి మెలోడీతో ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. కథానుగుణంగా సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉందని, ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, సంభాషణలు: హేమంత్, రచన-దర్శకత్వం: అశ్విన్‌రామ్.






# చెన్నై నేపథ్య ప్రేమకథ

సంతోష్‌శోభన్ కథానాయకుడిగా రూపొందుతోన్న లవ్ అండ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకుడు. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న, వాలెంటైన్స్ డే కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు. ఈ రోజు సంతోష్‌శోభన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా స్పెషల్ గ్లింప్స్‌తోపాటు ఈ సినిమా టైటిల్ లుక్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. టైటిల్ లుక్‌ని బట్టి ఇది చెన్నై నేపథ్యంలో సాగే ప్రేమకథ అని తెలుస్తున్నది. మానస వారణాసి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్, సహనిర్మాత: అజయ్‌కుమార్ పి.

# ఫిల్మ్‌ఫేర్‌లో కొత్త రికార్డు



కథానాయికగా అడుగుపెట్టిన వేళావిశేషం. అనతికాలంలోనే అద్భుతమైన పేరుప్రఖ్యాతులు సొంతం చేసుకున్నది అగ్ర నటి సాయిపల్లవి శంతామరై. తొమ్మిదేళ్ల కెరీర్. చేసింది 19 సినిమాలు. ఈ కాస్త పీరియడ్‌లోనే ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకోవడం సామాన్యమైన విషయం కాదు. ఇప్పటివరకూ ఆరు ఫిల్మ్‌ఫేర్స్ అందుకున్న కథానాయిక దేశంలోనే లేరు. పాతతరం కథానాయిక నూతన్ సమర్థ్, సీనియర్ కథానాయిక కాజోల్, అలియాభట్, వీరితోపాటు సాయిపల్లవి ఇప్పటివరకూ తలా అయిదుసార్లు ఫిల్మ్‌ఫేర్లు అందుకొని టాప్ లిస్ట్ ఉన్నారు. రీసెంట్‌గా ప్రకటించిన ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో అందర్నీ వెనక్కినెట్టి ఆరో ఫిల్మ్‌ఫేర్‌కు ఎంపికయ్యింది సాయిపల్లవి. ఇది నిజంగా గొప్ప విషయం. తొలి సినిమా 'ప్రేమమ్', తొలి తెలుగు సినిమా 'ఫిదా', శ్యామ్‌సింగ రాయ్, లవ్‌స్టోరీ, గార్గీ సినిమాలకు గాను అయిదుసార్లు ఫిల్మ్‌ఫేర్‌లు అందుకున్న సాయిపల్లవి, 2022 సంవత్సరానికి గాను 'విరాటపర్వం' సినిమాకు బెస్ట్ యాక్టస్‌గా ఆరోసారి ఫిల్మ్‌ఫేర్‌ని అందుకోనున్నది. పైగా వాటిలో నాలుగు తెలుగు సినిమాలే కావడం విశేషం. ఈ సందర్భంగా సాయిపల్లవిపై ప్రశంసల వర్షం కురుస్తున్నది.



# బురద జల్లుకోవడం పరిపాటైపోయింది

'ఎదిగే వారిని సాటివాళ్లే కిందికి లాగడం సహజంగా పాలిటిక్స్‌లో జరుగుతుంటుంది. ఇప్పుడు చిత్రపరిశ్రమలో కూడా జరుగుతోంది.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్. ఆయన నటించిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదలైంది. ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా మాట్లాడారు అక్షయ్‌కుమార్ 'నాది 34ఏళ్ల కెరీర్. ఒప్పుకున్న సినిమాకోసం ఎంతకష్టాన్నయినా ఇష్టంగా అనుభవిస్తా. నేను ఒకేసారి 17 సినిమాలకు పనిచేసిన రోజులున్నాయి. అవన్నీ 8నెలల కాలంలో విడుదలయ్యాయి. అది రికార్డ్. నేను హిట్స్ ఇస్తున్న రోజుల్లో నా గురించి అందరూ గొప్పగా మాట్లాడేవారు. ఇప్పుడు నా సినిమాలు కొన్ని ఫ్లాపులయ్యే సరికి వేరే విధంగా మాట్లాడుతున్నారు. పైగా కెరీర్‌కి ఇబ్బంది కలిగేలా కూడా ప్రవర్తిస్తున్నారు. వారెవరో తెలుసుకోవాల్సిన అవసరం నాకు లేదు. ఆలోచించను కూడా. పొలిటీషియన్స్ ఒకరినొకరు తిట్టుకున్నట్టు హీరో ఇంకో హీరోపై, దర్శకుడు మరో దర్శకుడిపై, అలాగే నిర్మాతలు ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం పరిపాటైపోయింది. ఈ విధానం సమాజానికి మంచిది కాదు' అంటూ వాపోయారు అక్షయ్‌కుమార్.

# ఆగస్ట్‌లో 'శివం భజే'



అశ్విన్ బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'శివం భజే'. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్ ముఖ్య పాత్రను పోషిస్తున్న ఈ చిత్రంలో దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తున్నది. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 1న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. వైవిధ్యమైన కథతో, ఉన్నతమైన సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందని, యాక్షన్ థ్రిల్లర్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే కథ ఇదని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిస, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేష్, దర్శకత్వం: అప్సర్.

# మరో దర్శకుడికి గ్రీన్‌సిగ్నల్?



వెంకటేశ్ మళ్లీ స్పీడ్ పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం ఇటీవలే మొదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా నిర్మాణంలో ఉండగానే, మరో దర్శకుడికి ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారట. ఆ దర్శకుడెవరో కాదు, నీదీ నాదీ ఒకే కథ, విరాటపర్వం చిత్రాలతో అభిరుచి గల దర్శకుడిగా ప్రశంసలందుకున్న వేణు ఊడుగుల. ప్రస్తుతం ఆయన ఈ స్క్రిప్ట్ పని మీదే బిజీగా ఉన్నారట. మల్టీస్టారర్ కథాంశంతో రూపొందనున్న ఈ సినిమాలో వెంకటేశ్‌తో పాటు మరో ఇద్దరు యువహీరోలు నటించనున్నట్టు సమాచారం. సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందనున్నట్టు తెలుస్తున్నది. సామాజిక సమస్యల చుట్టూ అల్లుకున్న కథలతో సినిమాలు తీసే వేణు ఉడుగుల.. వెంకటేశ్ కోసం ఏ తరహా కథను ఎంచుకున్నాడో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# హుషారుగా విజిలేస్కో..

తమిళ అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ తాజా చిత్రం 'GOAT' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్). వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్నది. సైన్స్‌ఫిక్షన్, దేశభక్తి ప్రధాన అంశాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో విజయ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. ఈ సినిమాలోని డ్యాన్స్ ఆంథమ్ 'విజిలేస్కో..' శుక్రవారం విడుదలైంది. యువన్‌శంకర్‌రాజా స్వరపరచిన ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించారు. హుషారైన బీట్‌తో సెలబ్రేషన్ సాంగ్‌గా ఆకట్టుకుంటున్నది. ఈ లిరికల్ వీడియోలో ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ అమీర్‌లతో కలిసి విజయ్ డ్యాన్స్‌లో అదరగొట్టారు. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేయనుంది.



# తెలుగుతెరపై కన్నడ సూపర్‌స్టార్

'జైలర్' సినిమాలో తక్కువ నిడివి గల పాత్ర చేసినా.. ఎక్కువ ఇంపాక్ట్ చూపించారు కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్. అంతకు ముందు బాలకృష్ణ 'గౌతమీపుత్ర శాతకర్ణి'లో కూడా ఓ ప్రత్యేక గీతంలో మెరిశారాయన. త్వరలో మరో ప్రతిష్టాత్మక తెలుగు సినిమాలో ప్రత్యేక పాత్ర చేసేందుకు శివన్న సైన్ చేశారు. ఆ సినిమా ఏదో కాదు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందనున్న 'ఆర్‌సీ 16'. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో శివరాజ్‌కుమార్ స్పెషల్‌రోల్ చేయనున్నారు. ఈ రోజు శివరాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని మేకర్స్ స్వయంగా ప్రకటించారు. ఇద్దరు స్టార్లతో సినిమా చేయడం పట్ల మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.



